క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాక్సిన్



దాచేపల్లి: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు డీపీటీ, టీడీ వ్యాక్సిన్ శుక్రవారం వేశారు. ఐదు సంవత్సరాల పిల్లలకు, 10 నుంచి 16 సంవత్సరాల పిల్లలకు ధనుర్వాతం, కంఠ సర్పి వ్యాధులు రాకుండా విద్యార్థులకు ముందు జాగ్రత్తగా టీకాలు వేశారు. మండల వ్యాప్తంగా వెయ్యి మంది విద్యార్థులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ షేక్ షాహిద్ సుల్తానా, డాక్టర్ మధు, ఆరోగ్య విస్తరణాధికారి పట్టాభి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మయ్య, సరస్వతి, మేరీ కుమారి, లలిత కుమారి పాల్గొన్నారు.

ఉచిత యోగ క్లాసులు

మాచర్ల: పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద ఆశ్రమంలో యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మెట్టు గోవిందరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం మహిళలు, సాయంత్రం పురుషులకు ఉచిత తరగతులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. వివరాలకు 9440006813 సంప్రదించాలని కోరారు.

ఎంఈఓగా శ్రీనివాస రెడ్డి



దాచేపల్లి: మండల విద్యాశాఖ అధికారిగా ఎ.శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మాచవరం మండలం పిన్నెల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డిని ఎంఈఓ-1గా ఉన్నత అధికారులు నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టి ఉపాధ్యాయులతో, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యాలయం సిబ్బందితో మాట్లాడారు. ఎంఈఓ ను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు సోము వెంకట రమణ, చెట్టిపోగు రాములు, మందా రాజశేఖర్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ పోరు



దాచేపల్లి: ఉపాధ్యాయుల సమస్యపై యూటీఎఫ్ పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి వట్టిపు నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలను యూటీఎఫ్ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయ సమస్యలపై వారు మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా ఐకమత్యంగా ఉండి సమస్యల సాధన కోసం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు రాజారావు, తగరం ఆనంద్ కుమార్, షేక్ మస్తాన్ వలి, నాగెండ్ల యేసయ్య, రాంబాబు, శ్రీనివాసరావు, వాసు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు భరోసానిద్దాం



పిడుగురాళ్ల రూరల్: ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి అని ఎయిడ్స్ బాధితులకు భరోసానిద్దాం అని లింక్ వర్కర్ స్కీము జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. పిడుగురాళ్ల మండలం, జూలకల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ సహకారంతో హెచ్ఐవీ, మాదక ద్రవ్యాలపై అవగాహన సైకిల్ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీము ఉమ్మడి గుంటూరు జిల్లాలో వంద గ్రామాల్లో పనిచేస్తున్నాయని, జిల్లాలోని 60 గ్రామాలలో 8 వారాల పాటు హెచ్ఐవీ, టీబీ, సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల ఐసీటీసీ కౌన్సిలర్ నాగరాజు, స్కూల్ హెడ్ మాస్టర్ సుబ్బారామయ్య, పీఈటీ కోటేశ్వరరావు, లింక్ వర్కర్లు దీనకుమారి దయామణి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు మార్కెట్‌యార్డు పాలకవర్గ ప్రమాణస్వీకారం

క్రోసూరు: పెదకూరపాడు నియోజకవర్గ క్రోసూరు మార్కెట్‌యార్డు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం ఈ నెల 24వ తేదీన జరుగుతుందని యార్డు కార్యదర్శి ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సమక్షంలో యార్డు చైర్మన్‌గా షేక్ జరీనా, పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తారన్నారు.



సత్రశాల.. ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన భ్రమరాంభికాదేవి అమ్మవారు



పిడుగురాళ్లలో కొబ్బరి బొండాలతో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



గాజులతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కనక దుర్గమ్మ..

ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

పిడుగురాళ్ల: పట్టణంలోని శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని శ్రావణ శుక్రవారం కావటంతో పలు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అదేవిదంగా భవానీ నగరన్‌లోని కనక దుర్గమ్మను గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారులను దర్శించుకొని తీర్థప్రసాదాలు పొందారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



పిడుగురాళ్లలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అంకాలమ్మ తల్లికి బోనాలు

కారెంపూడి: వీర్ల అంకాలమ్మ తల్లికి శుక్రవారం కూడా గ్రామస్తులు బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి శ్రావణ మాసం మొత్తం కూడా గ్రామస్తులు సామాజిక వర్గాల వారీగా నెల మొత్తం కూడా కుంకుమ బండ్లు కట్టి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కూడా భారీగా మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామ దేవతలు పోలేరమ్మ తల్లి, పాతపాటేశ్వరమ్మ అమ్మవార్లకు పోతురాజుకు ప్రత్యేక పూజలు చేశారు. అంకాలమ్మ బోనాల ఉత్సవంతో కారెంపూడి రణక్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.



అమ్మవారికి బోనాలు సమర్పించడానికి తరలివస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో చివరి శ్రావణ శుక్రవారం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో చివరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు కుంకుమ పూజలు, నోములు, ప్రత్యేక పూజలు చేశారు. సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో అర్చకులు చిట్టేల శివయ్యశర్మ నేతృత్వంలో భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. స్థానిక చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అర్చకులు ఓరుగంటి మారుతి శర్మ ఆధ్వర్యంలో, బాలవికాస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ సమీపంలోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అర్చకులు అనీల్ కుమార్ శర్మ నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రెంటాలలోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో సన్నెగండ్ల గోపాలచార్యులు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

పదో అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని

గురజాల: లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపు జిల్లా జడ్జి జి.ప్రియదర్శిని అన్నారు. స్థానిక కోర్టులో శుక్రవారం న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. రాజీ పడదగిన సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు వంటివి రాజీ చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా కక్షిదారులకు సమయంతో పాటు డబ్బులను కూడా వృథా కాకుండా చేసుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు, పిడుగురాళ్ల సివిల్ జడ్జి ప్రవల్లిక, బార్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రియదర్శిని

దేవుడికి సేవ చేయటం అదృష్టం

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: దేవుడికి సేవ చేయటం అదృష్టమని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని సెంటినరీ క్రీస్తు లూథరన్ దేవాలయం ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉన్నతమైన చర్చి నిర్మాణం చేపడతారనుకుంటే ఒక బ్రహ్మాండమైన చర్చి నిర్మాణం పిడుగురాళ్ల పట్టణంలో జరిగిందన్నారు. ఒక మంచి కార్యక్రమంలో తనకు భాగస్వామ్యం కల్పించారన్నారు. రోడ్డు వెడల్పు చేయటం, బైపాస్ రోడ్డు నిర్మాణం వలన ఈ చర్చి వద్ద ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండాపోయిందని పేర్కొన్నారు. ఆలోచించే విధానం ప్రతి ఒక్కరిలో మార్పు కలగాలని, ఆది ఆ దేవుడు కల్పించాలని ఆకాంక్షించారు. దేవుడి కృప నియోజకవర్గంలోని ప్రజలందరిపై తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మాదల కిరణ్‌కుమార్, కౌన్సిలర్ జడ సురేంద్ర, కో ఆప్షన్ సభ్యులు పిల్లి ప్రేమానందం, శెట్టుపల్లి పూర్ణ, లాయర్లు బత్తుల దాసు, దారా చెన్నయ్య, కె. రమణ, నేలపాటి కోటేశ్వరరావు(ఇస్మాయిల్), పాశం శ్యామ్, యర్రం సామేలు, దొప్పలపూడి రవీంద్రబాబు, కోడిరెక్కె ఆనందబాబు, బుచ్చు బాబు, గోసుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



స్వామివారికి కొవ్వొత్తులను తీసుకొని వస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం

పీఏసీఎస్ చైర్మన్ నాగేశ్వరరావు

గురజాల: జీడీసీసీ సేవలను రైతులు, ప్రజలు, ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్ పోటు నాగేశ్వరరావు కోరారు. స్థానిక బ్యాంకులో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు 8శాతం వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. క్రాప్ లోన్‌తో విద్య రుణ సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. రైతులకు ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్

సీపీఎస్ రద్దు మహాసభను విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: సీపీఎస్ రద్దుకై సెప్టెంబర్ 1న విజయవాడలో తలపెట్టిన మహాసభను విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల విద్యావనరుల కార్యాలయం వద్ద శుక్రవారం మహాసభ వాల్ పోస్టర్లు వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే మహాసభ నిరసన కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిన్నం శ్రీనివాసరావు, టి.రాజు, కటారి సురేష్, మోదుగుల అప్పారావు, శివారెడ్డి, జి.సునీల్‌బాబులు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మిర్చి నారుమళ్లలో తెగుళ్ల నివారణపై అవగాహన

అమరావతి: ప్రస్తుతం మిరప నారుమళ్లలో వచ్చే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని నారుకుళ్లు, కానోఫోరా తెగులు, పైముడత, కింది ముడత, పొగాకు లద్దె పురుగుల ఉనికి ఎక్కువగా ఉంటుందని ఏవో ఎస్‌కే అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆయన రైతులకు నారుమళ్ల యాజమాన్యంపై సూచనలిస్తూ జూలై, ఆగస్టు నెలల్లో కురిసే వర్షాలకు నారుమడుల్లో నీరు నిలిచిపోయి నారుకుళ్లు తెగులు ఉధృతంగా వ్యాపిస్తుందన్నారు. దీని నివారణకు విత్తిన నాలుగైదు రోజులకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రా. రిడోమిల్ కలిపి నాలుగైదు రోజులకు ఒకసారి రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయాలన్నారు. అధిక వర్షాలు కురిస్తే కానోఫోరా కొమ్మకుళ్లు తెగులు వృద్ధి చెందుతుందని, దీని నివారణకు లీటరు నీటికి 2 మి.లీ హెక్సాకొనజోల్ లేదా 3 గ్రా. ఆక్సీక్లోరైడ్ పిచికారీ చేయాలన్నారు. నారుమడుల్లో ట్రిపునిల్ గుళికలు వేస్తే 20 రోజుల వరకు పైముడత తెగులు ఆశించే అవకాశాలు తక్కువగా ఉంటాయని, నివారణకు లీటరు నీటికి 2 మి.లీ రీ జెంట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కింది ముడత నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. నీటిలో కరిగే గంధకం, 5 మి.లీ డైకోఫాల్, 3 మి.లీ ఫోసలోన్ వంటి మందులను పిచికారీ చేయాలన్నారు.



ధరణికోటలో మిర్చి నారుమళ్లు

సీపీఐ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయండి



మాచర్ల: సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని మాచర్ల నియోజకవర్గ ఏరియా కార్యదర్శి మేకల పోతుల శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని కామెర వీరాస్వామి భవనంలో శుక్రవారం మహాసభల గోడపత్రులు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి 25 వరకు ఒంగోలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎం.బాబురావు, నర్రా రంగా స్వామి, బ్రహ్మాచారీ, లక్ష్మయ్య, కందుకూరి వీరబ్రహ్మాచారీ, తాళ్లూరి అనిల్ పాల్గొన్నారు.

తిమ్మాపురం బైపాస్ వద్ద పోలీసుల తనిఖీలు

- 51 మందిపై కేసులు నమోదు
- రూ.52, 785 జరిమానా విధింపు

యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం బైపాస్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత కోసం పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. యడ్లపాడు ఎస్ఐ టి.శివరామకృష్ణ సిబ్బంది పాల్గొన్న ఈ తనిఖీలలో హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన 51 వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.52,785 జరిమానాలు విధించారు. అలాగే, మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజల ప్రాణభద్రత తమకు ప్రథమ ప్రాధాన్యమని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ప్రాణాలను రక్షించే కవచమని, పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రత కోసం తరచూ తనిఖీలు కొనసాగుతాయి అని తెలిపారు.



తిమ్మాపురం బైపాస్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ

ఏపీయూడబ్ల్యూజేలో సభ్యత్వం నమోదు చేసుకోవాలి

మాచర్ల: ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వం ఈనెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలని పల్నాడు జిల్లా అధ్యక్షుడు భువన, కార్యదర్శి వి.మురళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యత్వ నమోదు, యూనియన్ సభ్యులంతా గుంటూరులోని లలితా ఆస్పత్రిలో 50 శాతం రాయితీ పొందవచ్చని తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

పిడుగురాళ్ల: అఖిల భారత చిరంజీవి యువత కామిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో సూర్య కిరణ్ మానసిక వికలంగుల పాఠశాలలో చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పట్టణ సీఐ శ్రీరాం వెంకట్రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంతో మందికి రక్తదానం చేయటం వలన ప్రాణాలను కాపాడవచ్చునని సాటి చెప్పిన వ్యక్తి చిరంజీవి అని కొనియాడారు. అనంతరం మానసిక వికలాంగుల పిల్లలకు కేక్ కట్ చేసి తినిపించారు. పుస్తకాలను పంపిణీ చేశారు.

తిరుపతమ్మ తల్లికి శ్రావణమాస బోనాలు

బెల్లంకొండ: శ్రావణ మాసం సందర్భంగా మండల కేంద్రంలోని యాదవ కాలనీ తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి వైభవంగా భక్తులు బోనాలను సమర్పించారు. గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. జలబిందెలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు జలాభిషేకాలను నిర్వహించారు. పొంగళ్లు చేసి నైవేద్యాలను సమర్పించారు. ఆలయ ధర్మకర్త నిడమానూరి ప్రసాదరావు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా మేకల హనుమంతరావు

అమరావతి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ నియామకాలలో భాగంగా అమరావతి మండలానికి చెందిన మేకల హనుమంతరావును శుక్రవారం రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. నూతనంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితుడైన హనుమంతరావును బీజేపీ పల్నాడు జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు, బీజేపీ నాయకులు మద్ది ధాత్రినారాయణ, నేరెళ్ళ హనుమంతరావు, గోగినేని వెంకటరమణలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు అభినందించారు.

అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలి

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు

సత్తెనపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పద్ధతిలో ప్రశ్నాపత్రాల విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని యూటీఎఫ్ సత్తెనపల్లి మండల శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అసెస్‌మెంట్ బుక్ విధానంలో పరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థులకు ఎటువంటి ప్రయోజనం కలగకపోగా ఉపాధ్యాయులు విలువైన బోధన సమయం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కేటాయిస్తున్న బోధనేతర పనుల నుంచి వారిని తొలగించాలన్నారు. సత్తెనపల్లి శాఖ అధ్యక్షుడు పాలెపోగు రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నంబుల విష్ణు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోషల్ సబ్జెక్టులో సిలబస్ తగ్గించాలన్నారు. సీనియర్ నాయకులు వెంకట్రావు, టాగూర్, నరసింహారావు, సురేష్, కిషోర్, శ్రీనివాసరెడ్డి, శేషిరెడ్డి, శేషగిరి, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలో బైక్ చోరీ

సత్తెనపల్లి: ద్విచక్ర వాహనం చోరీ జరిగిన ఘటన పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జరిగింది. వివరాలు.. యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన పి.నరేంద్ర తన కుమారుడు అస్వస్థతతో ఉండటంతో ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో వైద్యం చేయించేందుకు వచ్చాడు. గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని వైద్యశాల ప్రాంగణంలో పార్క్ చేశాడు. వైద్య సేవల అనంతరం బయటకు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం కనిపించలేదు. గుర్తు తెలియని దుండగులు అపహరించారని నిర్ధారించుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

గణేష్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బెల్లంకొండ: వినాయక చవితిని పురస్కరించుకుని గణేష్ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ డి.ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఉత్సవాల నిర్వాహకులు ముందస్తుగా పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహించే వివరాలను తెలియజేయాలని సూచించారు. తద్వారా సమస్యాత్మక ప్రదేశాలలో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా పూజలు జరుపుకోవాలని, అధిక శబ్దంతో మైకుల ఏర్పాటు నిషేధమని తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకున్నా నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

బెల్లంకొండ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని ఆ దిశగా విద్యనభ్యసించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గర్నెపూడి సునీత తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఫ్రెషర్స్ డే' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇష్టంతో కష్టపడి చదివే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. కళాశాలలో చదివి గొప్ప స్థాయికి వెళ్లిన విద్యార్థులు ఎందరో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బి.సౌమ్య, బి.అఖిలాబాయి, వీవీఐటీలో సీటు సాధించిన బండారు కళ్యాణిలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.కవిత, లక్ష్మీసులోచన, వై.రమేష్ బాబు, సాంబశివరావు కుసుమకుమారి, రత్నకుమారి, సత్యప్రభ, బాలునాయక్, పి.రమేష్, అంకమ్మ, అరుణ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన



పెదకూరపాడు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన అండర్-22 బాలికల వాలీబాల్ పోటీల్లో జీఆర్‌సీఆర్కే శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు పాఠశాల డైరెక్టర్ రాము, కవిత శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. 7 జిల్లాల స్థాయిలో జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రెండో స్థానం సాధించారన్నారు. సీనియర్ వాలీబాల్ ప్లేయర్, శాప్ డైరెక్టర్ అరికపూడి రమణరావు, వాలీబాల్ టీమ్‌ని అభినందించారు. పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.